కాలుష్య కారకాలుగా కాల్వ గట్లు

- గట్లపైనే కోళ్ల వ్యర్థాలు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల డంప్
- దుర్గంధంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం
- పట్టించుకోని అధికారులు


కృష్ణా కాలువలో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు వదులుతున్న దృశ్యం


కృష్ణాకాలువ గట్టుపై దర్శనమిస్తున్న చెత్తా చెదారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని కాల్వ గట్లు కాలుష్యా కారకాలుగా మారిపోతున్నాయి. ఆశ్రం వైద్య కళాశాల నుంచి గోదావరి కాల్వ గట్టు తూర్పు లాకుల వరకు, అక్కడి నుంచి కృష్ణా కాలువ గట్టు నగర శివారు వట్లూరు వరకు ఇరువైపులా చెత్తా చెదారంతో దర్శనమిస్తున్నాయి. తూడు, నాచుతో ఉండే ఈ కాల్వలు ప్రస్తుతం వేసవి కావడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి నిల్వ ఉన్న నీటిలో చెత్త కలిసి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ చేయాల్సిన కార్పొరేషన్ అధికారులు, కాల్వ గట్లు నిర్వహించాల్సిన ఇరిగేషన్ అధికారులు తమది కాదంటే తమది కాదని పట్టించకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్గంధం, ఈగలు, దోమలతో వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

డంపింగ్ యార్డులుగా దర్శనం

చిరువ్యాపారులు తాగిపడేసిన కొబ్బరి బొండాలను, చెరుకు రసం తీయగా వచ్చిన పిప్పిని కాల్వ గట్లపై పడేస్తున్నారు. ఖాళీ కొబ్బరి డొక్కల్లో దోమలు, చెరుకు పిప్పికి ఈగలు విజృంభిస్తున్నాయి. క్లాప్ ఆటోలను నిలిపివేయడంతో కొందరు పారిశుద్ధ్య కార్మికులు నగరంలోని ఇళ్ల వద్ద సేకరించిన చెత్తను కాల్వ గట్లపై డంప్ చేస్తున్నారు. చికెన్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను కాల్వ గట్లపై డంప్ చేస్తున్నారు. సీఆర్ఆర్ కళాశాల వెనుక భాగంలో రామకృష్ణాపురం ప్రారంభంలో కృష్ణా కాల్వ, తిమ్మిలేరు ఏటిగట్టుపైనా చికెన్ వ్యాపారాలు చేస్తున్నారు. వీరు కోళ్ల వ్యర్థాలను కాల్వల్లో వదిలేస్తున్నారు. సమస్యను సంబంధిత అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా వ్యాపారాలు ముట్టజెప్పే మామూళ్ల కారణంగా వారి జోలికి వెళ్లడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కోసారి ఈ దుర్గంధాన్ని భరించలేక స్థానికులు సంబంధిత వ్యాపారులను ప్రశ్నిస్తే వారు వాగ్వాదానికి దిగడం, దాడులకు తెగబడడం చేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. సెప్టిక్ ట్యాంక్‌లు క్లీన్ చేయగా వచ్చిన షిల్టును కూడా కృష్ణా కాల్వలోనే వడిలేస్తున్నారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి



కాల్వ గట్లపై చెత్తాచెదారం వేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలి. మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించి, ప్రజల నుంచి సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు కాల్వ గట్లపై వేయకుండా చేయాలి. గట్లపై వేస్తున్న చెత్త వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలి. లేని పక్షంలో కాల్వలకు నీరు రాగానే కలుషితమైతే అధికారులదే బాధ్యత.

– పొట్నూరి లక్ష్మణరావు, స్థానికుడు

శుభ్రం చేయాలి



వేసవి కాలంలోనే కాల్వ గట్లను శుభ్రం చేయించాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలి. ముఖ్యంగా కోళ్ల వ్యర్థాలను గట్లపై వేస్తున్నవారిపై తగిన చర్యలు తీసుకోవాలి. వ్యర్థాలు కాల్వ గట్లపై వేయకుండా నియంత్రించాలి. ఆయా కాల్వలు కొన్నిచోట్ల పూడిపోయి ఉన్నాయి. కాల్వలకు నీరు వచ్చే సమయానికి నీటిపారుదల సజావుగా సాగేలా తవ్వకం పనులు నిర్వహించాలి.

– డి.శివ సత్యనారాయణ, స్థానికుడు

క్లుప్తంగా

జయప్రకాష్ పరామర్శలు


రమేష్‌ను పరామర్శిస్తున్న జయప్రకాష్

ఏలూరు (టూటౌన్) : ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాసరి రమేష్‌ను ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్త ఉత్తరవెల్లి శ్రీను తండ్రి పెద్ద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. జేపీ వెంట పార్టీ నాయకులు గుడిదేశి శ్రీనివాసు, నేరుసు చిరంజీవి, పల్లి శ్రీనివాసు, మున్నుల జాన్‌గుర్నాథ్, బుద్ధాల రాము, కిలాడి దుర్గారావు, ఫణి, సత్యనారాయణ, దాలి వెంకటేష్, సత్యదేవ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

చేనేతలందరికీ నేతన్న నేస్తం వర్తింపజేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న నేత కార్మికులు

ఏలూరు (టూటౌన్): నేతన్న నేస్తం పథకాన్ని సొంతమగ్గం ఉన్నవారితో పాటు చేనేత పని చేస్తున్న ప్రతి కార్మికునికీ అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడుపు కన్నయ్య ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) 90వ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక 36వ డివిజన్ భగత్ సింగ్ సెంటర్లో గురువారం ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్నట్టు కన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు బి.సత్యనారాయణ, ఎన్.శేఖర్, ఎం అమ్మాజీ, కే రంగనాయకమ్మ, సూర్యకాంతం, పాపాయమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్గిపుల్లపై పూలే దంపతులు



ఏలూరు (టూటౌన్) : ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని అగ్గిపుల్లపై పూలే దంపతుల రూపాలను చిత్రీకరించి అబ్బుర పరిచారు సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్‌బాబు. అగ్గిపుల్లపై చాక్‌పీస్‌ను ఉపయోగించి వారిద్దరి రూపాలను చెక్కారు. సురేష్‌ను పలవురు నగర ప్రముఖులు అభినందించారు.

కొత్తపేటలో భారీ అన్నసమారాధన


అన్నసమారాధన ప్రారంభిస్తున్న మహిళా భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక 43వ డివిజన్ కొత్తపేట దాసరి ఎర్రయ్య వీధిలో మహిళ భక్తులచే సీతారామ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త గొంతిన రామకృష్ణ మాట్లాడుతూ బాల బాలికలు, మహిళలంతా కలిసి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారని తెలిపారు. పూజ కార్యక్రమం, అన్నసమారాధనకు సహకరించిన వారందరికీ ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ డిపోలో తనిఖీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ స్థానిక డిపోలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విజయవాడ జోన్–2 జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్యారేజ్‌లో మెకానికల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్యారేజ్‌లో వాషింగ్ ప్లాంట్, మిగిలిన విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ ఆసుపత్రిని సందర్శించారు. ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ మేనేజర్ జి.మురళి, ఎంఎఫ్ ఐ.ప్రేమ్ కుమార్, కార్మిక సంఘాల నాయకులు, పీఆర్‌ఓ కేఎస్‌ఎల్ నరసింహం పాల్గొన్నారు.

రక్తదానం యజ్ఞంలా చేయాలి


రక్తదానం చేస్తున్న కళాశాల విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని ఒక యజ్ఞంలా చేయాలని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కె.వేణుగోపాల్ అన్నారు. గురువారం స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్‌సీఈఈ – ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ యుక్తవయసులో ఉన్న వారు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, దానివల్ల వారిలో కొత్త రక్తం తయారై మరింత ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీధరరావు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఒకరికి ప్రాణదానం చేసినట్టేనని గుర్తించాలన్నారు. ప్రతి విద్యార్థీ చదువుతోపాటు సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డీన్‌లు, హెచ్‌ఓడీలు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సత్రంపాడు, విద్యా వికాస్ రోడ్డు, సీతారామపురం రోడ్డు ప్రాంతాలు, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోణంగి, పోణంగి రోడ్డు, వైఎస్ఆర్ కాలనీ, ఇనమ్మ కుంట, జగనన్న హౌసింగ్ కాలనీ పరిసర ప్రాంతాలు, ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆటోనగర్, కొమడవోలు, తూర్పు లాకులు, సాయి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రేమాలయం రోడ్డు, పెదమాలపల్లి, తూర్పువీధి, గంగానమ్మ గుడి ప్రాంతం, ఫిల్‌హౌస్ పేట, చాటపర్రు రోడ్డు, జ్వాల పరమేశ్వర కాలనీ, దక్షిణపు వీధి, అశోకచక్రం రోడ్డు, పోణంగి రోడ్డు, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం రోడ్డు, పాలతూము సెంటర్, శనగపప్పు బజారు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

విద్యార్థి మృతి కేసులో దర్యాప్తు ముమ్మరం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మానూరులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నన్నయ యూనివర్సిటీ పీజీ స్టూడెంట్ వెంకటేష్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బుధవారం మానూరు గ్రామంలోని విద్యార్థి తన నివాసంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి విదితమే. ఈ కేసులో వెంటనే పోలీసులు వెంకటేష్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, కాల్ డేటాకు పంపారు. ఆ వివరాలు వచ్చిన వెంటనే ప్రాథమికంగా వెంకటేష్ మృతికి ఆధారాలు లభ్యం కానున్నాయని ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. వెంకటేష్‌కు అనారోగ్య సమస్యలు లేవని, మరణానికి కారణాలు త్వరితగతిన బహిర్గతం కావాలని అతని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కోరుతున్నారు.

మాజీ మంత్రి కారుమూరిపై కేసు నమోదు

ఏలూరు టౌన్: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెదపాడు మండలం టీడీపీ వట్లూరు గ్రామ అధ్యక్షుడు నూతలపాటి నవీన్‌రాజ్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. ఈ నెల 8న ఏలూరులో జరిగిన వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యకర్తలు, నేతల ఆత్మీయ సమావేశంలో కారుమూరి మాట్లాడుతూ.. టీడీపీ కార్యకర్తలు భయభ్రాంతులకు గురయ్యేలా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

భీమడోలు: ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని గుండుగొలను సెక్టార్ సూపర్ వైజర్ ఎం. కవిత తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పూళ్ల సెక్టార్ పరిధిలోని చెట్టున్నపాడు గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులతో కలిసి గురువారం అవగాహన ర్యాలీలను నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను మహిళలకు వివరించారు. చిన్నారుల్లోని పౌష్టికాహార లోపాలను గుర్తించి వాటిని నివారించడం జరుగుతుందన్నారు, చిరుధాన్యాల వినియోగం వల్ల ఆరోగ్య సంరక్షణ సాధ్యమన్నారు. అంగన్‌వాడీల్లోని పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టిని చూపాలన్నారు. బడి ఈడు పిల్లలంతా విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎఎన్ఎం పేరంటాలు, కార్యకర్తలు బి.నాగదుర్గ, డి.సౌమ్య సుధ, సీహెచ్ మహాలక్ష్మి, ఆశావర్కర్ డి.పాప తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం.. కళావిహీనం


జిల్లా పరిషత్ గార్డెన్


కలెక్టరేట్‌లో ఇలా..


జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు, పచ్చగడ్డి ఎండిపోయి కళావిహీనంగా మారాయి. క్లీన్ అండ్ గ్రీన్ అంటూ ఫొటోలకు పోజులివ్వడం తప్ప పచ్చని మొక్కల పర్యవేక్షణను పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఏలూరు జిల్లా పరిషత్, కలెక్టరేట్, ఇరిగేషన్ తదితర అన్ని కార్యాలయాల్లోనూ పచ్చదనం కరుమరుగైంది. మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు


ఇరిగేషన్ కార్యాలయంలో..


డీఈఓ కార్యాలయం వద్ద


జెడ్పీ ప్రాంగణంలో ఉన్న పుట్టలు

ఈ ఏడాది తాగునీరందిస్తామనే నమ్మకం కలగడం లేదు


సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు

ఏలూరు (టూటౌన్): ఈ వేసవిలో ఏలూరు నగర ప్రజలకు మంచినీటిని కొరత లేకుండా అందించగలుగుతామనే నమ్మకం కలగడం లేదని నగర కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం పలువురు కార్పొరేటర్లతో కలిసి ఆయన దెందులూరులో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించి ఈ వ్యాఖ్యలు చేశారు. ఏలూరు మున్సిపాలిటీ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఈ సంవత్సరం మంచినీటి కొరత ఏర్పడిందన్నారు. ఈ సంవత్సరం నగర ప్రజలకు రెండు పూటలు మంచినీళ్లు అందించడానికి మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, కమిషనర్, ఇంజినీరింగ్ విభాగం ఎంఈ, మున్సిపల్ ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ ఏఈ, ఎలక్ట్రికల్ సిబ్బంది మొత్తం పగలు రాత్రి తేడా లేకుండా నిర్విరామంగా కృషి చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ మోటర్లు తిరగడానికి దపదపాలుగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. గోదావరి జలాలను సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోకి లిఫ్టింగ్ చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉన్న మోటర్లు సరిపోకపోవడంతో, కలెక్టర్ అనుమతితో అదనపు మోటార్లను ఏర్పాటు చేసి ఏలూరు కాల్వకు వస్తున్న గోదావరి జలాలను సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోకి లిఫ్టింగ్ చేస్తున్నామని వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా మోటర్లు ఆగిపోవడం వాటర్ లిఫ్ట్ చేయడానికి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ప్రజలు నీటిని వృథా చేయవద్దని కోరారు. ఎంఈ సురేంద్రబాబు, ఎలక్ట్రికల్ ఏఈ సాంబశివరావు, కార్పొరేటర్లు జున్నూరు కనక నరసింహారావు, పాము శామ్యూల్ తదితరులు ఉన్నారు.

మల్కాపురం సర్పంచ్‌కు పరామర్శ


సునీతను పరామర్శిస్తున్న పార్టీ నాయకులు

దెందులూరు: ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న ఏలూరు రూరల్ మండలం మల్కాపురం సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పి.సునీతను గురువారం ఆమె నివాసంలో ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరిలో వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పార్టీ రాష్ట్ర నేత పల్లెం ప్రసాద్, పార్టీ ఎస్సీసెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, సర్పంచులు ప్రభుదేవా, రఘు పరామర్శించారు.

రైతులకు సత్వర సేవలు అందించాలి


రైస్ మిల్లు వద్ద రైతులతో మాట్లాడుతున్న రమాదేవి

భీమడోలు: రైతులకు సత్వర సేవలు అందించి అండగా నిలవాలని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. జేసీ ధాత్రిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం పోలసానిపల్లి, భీమడోలు 1, 2,3 రైతు సేవా కేంద్రాలు, రైస్ మిల్లులను భీమడోలు తహసీల్దార్ రమాదేవి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తేమ శాతం గుర్తించే విధానాన్ని పరిశీలించారు. అంబర్‌పేటలోని శ్రీదుర్గ ఆగ్రో ఇండస్ట్రియల్, విజయదుర్గా రైస్ మిల్లులను సందర్శించారు. రికార్డులను ఆమె పరిశీలించి పలు సూచనలు అందించారు. రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన గోనె సంచులు పంపిణీ చేయాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వారికి హెచ్చరించారు. తొలుత రైతు సేవా కేంద్రాలను ఆమె పరిశీలించారు. 17 తేమ శాతం కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలని, అదే విధంగా అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద తేమ కొలుచే యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులకు ఎటువంటి చిరుగులు లేని సంచులను ఇవ్వాలన్నారు. రైతుల అనుమానాలను నివృత్తి చేయాలని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భరత్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	28	బిళ్లచిక్కుడు	70
వంకాయలు (తెలుపు)	24	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	28	కంద	76
కాకర కాయలు	30-34	బీట్‌రూట్	30
బీరకాయలు	34	కీరా దోస	30
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు – తిరుపతి	16.00	4830	32